# ఆ అబ్బాయి రాలేదు: ఈ అబ్బాయిమాత్రం....

* తోలేటి విశ్వనాధరావు *

రైలు ఎక్కినప్పటినుంచి ఆ అబ్బాయిని ఏదో కసురుతూనే ఉందావిడ. ఆ కుర్రాడు ట్రయిను ఆగిన ప్రతిస్టేషనులోనూ ఏదో అడుగుతున్నాడు. ఆమె కళ్లు ఎర్రచేస్తూ ఉంది. నాకుమాత్రం వారి ద్దరి చేష్టలూ కొంచెంకూడా అర్ధంకాలేదు.

స్టేషనులో ట్రైను ఆగింది. ఆమె "కాసిని మంచినీళ్ళు తీసుకురారా" అంటూ మరచెంబు యివ్వబోయింది ఆ అబ్బాయికి.

"పుస్తకం కొనుక్కోడానికి పావలాలేదు కాని మంచినీళ్ళు తీసుకురాడానికి నేనున్నానేమిటి — అంటూ విసుక్కున్నాడు,

అప్పు డర్ధమయింది ఆ అబ్బాయి ఆరాటం.

"ఈ చెత్త పుస్తకాలకోసం పావలాలూ, అర్ధలూ తగలెయ్యడానికి ఉరికే వస్తున్నాయిరా." ఆమె కానీ కర్చు చెయ్యదలచుకోలేనట్లుంది.

ఆ అబ్బాయి అంత ఆశపడుతూన్నప్పుడు ఒక పావలా యిస్తే ఏంపోయిందో ఆ తల్లికి!

నీళ్ళు తీసుకోని వచ్చాడు ఆ కుర్రాడు. ఇంత లోనే మా కంపార్టుమెంటుదగ్గరికి ఒక పత్రికల అబ్బాయి వచ్చాడు వారపత్రికలపేర్లు వరసగా వల్లించుకుంటూ.

"అమ్మా.... ఒక పుస్తకం...." మళ్ళీ ఆరం భించాడు ఆ అబ్బాయి.

ఏమనుకుందో ఆమె పత్రికలబ్బాయిని పిలి చింది. ఆ పుస్తకాల్లోంచి ఒకదాన్ని తీసుకుని పేజీతరువాత పేజీ చూడటం మొదలుపెట్టింది

"నాలుగణాలు యియ్యండమ్మా...." బయట నుంచి అడిగాడు పుస్తకాలబ్బాయి.

పావలా తీసి యిచ్చింది.

ఆ అబ్బాయి ముఖంలో సంతోషం తాండవిం చింది.

పుస్తకాలబ్బాయి వెళ్లిపోబోతూంటే వెనక్కి పిలిచి "ఇదిగో....ఆ పుస్తకంకూడా యియ్యి" అంటూ ఆమె మరొక పుస్తకం తీసి దాన్ని పరిశీ లించడం మొదలుపెట్టింది.

క్రమంగా ఆమెలో అసంతృప్తి బయలుదేరిన ట్లుంది!...."అంతా దండుగే-" విసుక్కున్నది.

"ఆ పావలా యియ్యి....అర్ధరూపాయి యిస్తా ను...." అందామె.

పుస్తకాలబ్బాయి నాలుగణాలు తిరిగి యిచ్చి వేసాడు.

పర్సులోని రూపాయినోటు తీసి "చిల్లర లేదూ?...." అడిగింది ఆమె.

జేబులు రెండూ తడిమి లేదన్నాడు.

"అయితే నీ పుస్తకాలు తీసేసుకో...." పుస్త కాలని తిరిగి యిచ్చివేసింది.

ఆమె తెలివికి నాలో నాకే ఆశ్చర్యంవేసింది.

పత్రికలబ్బాయిమటుకు ఏ దెబ్బలాటా లేకుం డా వెళ్ళిపొయ్యాడు!

వెళ్ళిన అయిదు నిముషాల్లో తిరిగివచ్చి "అమ్మా....యీ రెండు పుస్తకాలూ అరణాలకు తీసుకోండి, రూపాయి యీయండి చిల్లర తీసు కువస్తాను."

బేరం లాభం వస్తోందనికాబోలు రెండు పుస్త కాలూ తీసుకొని రూపాయి నోటు యిచ్చిందామె.

"రెండు నిమిషాల్లో తీసుకువస్తానమ్మా చిల్లర" అంటూ ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు,

ట్రెయినుకి గంటకొట్టారు, పత్రికలబ్బాయి రాలేదు.

"అయ్యో! టయిము అయిపోయిందే" ఆమె ఆత్రపడుతూంది. పత్రికలబ్బాయి యింకా రాలేదు. ట్రయిను కదిలింది

"ఎంతపని చేసాడు. పత్రికలంటగట్టి పదణా లు నష్టంపెట్టాడే" ఆమె విచారానికి అంతులే కుండా ఉంది!

రూపాయి పోతేపోయిందిగాని వాళ్ళ అబ్బాయి ముఖం వికసించింది.

పత్రికలబ్బాయి తెలివికి సంతోషించాలో మోసానికి ఆశ్చర్యపడాలో నాకు బోధపడలేదు.